క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని బొమ్మనుకుంటకు చెందిన ఏర్రోళ్ల శ్రీనివాస్(36) పెయింటర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం మధ్యాహ్నం పని ముగించుకొని బీరంగూడ నుంచి జానకంపేట వైపు తన ద్విచక్రవాహనంపై వస్తుండగా బచ్‌పన్ స్కూల్ సమీపానికి రాగానే బైక్‌ను అతివేగంగా నడిపి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలైన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం అశోక్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు చంద్రయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

జహీరాబాద్ టౌన్: హజ్‌యాత్రకు వెళ్లేందుకు ఎంపిక చేసిన యాత్రికులకు హజ్ వెల్ఫేర్ సొసైటీ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలో ఉన్న మద్రాసాలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని టీఎస్‌ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్ ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు యాత్రికులకు హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించి ఇమ్యునైజేషన్ టీకాలు వేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: బెల్ట్‌షాప్‌లపై పోలీసులు దాడులు నిర్వహించి 37 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ తండాకు చెందిన రమేష్, ప్రకాశ్‌చంద్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ, సిబ్బందితో కలిసి ఇరువురి బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 37 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని మద్యం విక్రయిస్తున్న రమేష్, ప్రకాష్‌పై కేసు నమోదు చేశారు.

సౌకర్యాలు కల్పించాలి

రాయికోడ్(అందోల్): పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీఓ ఎంఎం షరీఫ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రాయికోడ్‌లోని ఎంపీపీ సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌లలో సరైన వసతులు ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏపీఓ రమేష్‌కుమార్, ఎంపీడీసీ కార్యాలయ సిబ్బంది రాంకిషన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మారేపల్లిలో ఈ నెల 15వ తేదీ నుంచి 19 వరకు వైకుంఠపురం ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్న లక్ష్మీనారాయణ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను సంగారెడ్డిలోని వైకుంఠపురంలో దేవనాథ జీయర్‌స్వామి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని సూచించారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించండి

సంగారెడ్డి టౌన్: విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెన్నార్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ఎంఎన్ రాజు అన్నారు. సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాది గ్రామ శివారులోని ఎమ్మెన్నార్ ఎడ్యుకేషన్‌లో గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ప్రొఫెసర్లు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాల్టీ పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులు బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రుబీనా నజీబ్, మాజీ వైస్ చైర్మన్ ఆహీర్ పరశురాం, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షులు నగేష్, ముఖ్యనాయకులు అభిషేక్ షెట్కార్, ముజమ్మిల్, విఠల్, ఉబేద్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సమస్యల పరిష్కారం

జహీరాబాద్: జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని మాణిక్‌ప్రభు, కౌలాస్, మోచి కాలనీల్లో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా, పట్టణ నాయకులు విశ్వనాథ్‌స్వామి, బక్కయ్యగుప్త, శోభారాణి, అర్చన సారదా, కుసుమం, సోమ అనిల్ పాల్గొన్నారు.

పదేళ్లు గడుస్తున్నా పట్టింపేదీ?

- అసంపూర్తిగా ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు పనులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- పనులు పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అనేక కాలనీలు వెలుస్తుండటంతో జనాభా సైతం అధికంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం 2015లో శేరిలింగంపల్లి పరిధిలోని గోపన్‌పల్లి తండా నుంచి తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ మీదుగా కొల్లూర్ రింగ్ రోడ్డు జంక్షన్ వరకు ఓఆర్‌ఆర్ 30 ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు నెంబర్–7 పనులను ప్రారంభించింది. కొన్నాళ్లు సాఫీగా సాగిన పనులు ఆ తర్వాత కొందరు రైతులు కోర్టును ఆశ్రయించడంతో పనులు నత్తనడకన కొనసాగాయి. కోర్టు తీర్పు అనంతరం పనులను వేగవంతం చేసినా నేటికీ పూర్తి చేయకపోవడంతో తరచూ వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)



అసంపూర్తిగా ఉన్న ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు నిర్మాణం

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా కాలనీలు ఏర్పడటంతో జనాభా ఎక్కువగా పెరగడంతో శేరిలింగంపల్లి పరిధిలోని గోపన్‌పల్లి తండా నుంచి తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ మీదుగా కొల్లూర్ రింగ్‌రోడ్డు జంక్షన్ వరకు ఈ మార్గంలో భవన నిర్మాణాలు ఎక్కువ జరుగుతుండటంతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో వాహనాల నుంచి పెద్ద పెద్ద రాళ్లు కింద పడుతుండటంతో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికే అనేకమంది ప్రాణాలు కోల్పోగా ఎంతోమంది తీవ్రంగా గాయాల పాలయ్యారు.

కాలనీలకు కనెక్టివిటీగా రేడియల్ రోడ్డు

ఓఆర్‌ఆర్ 30 ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు నెంబర్–7 సుమారు 15 గ్రేటెడ్ కాలనీల మీదుగా వెళ్తుండగా ఈ రోడ్డు 40కాలనీలకు కనెక్టివిటీగా ఉంది. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ రోడ్డు పనులపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నిత్యం ప్రమాదాలు

ప్రస్తుతం ఈ ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డుపై కంకరా, మట్టి దర్శనమిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు సరిగా లేకపోవడం, మధ్యలో డివైడర్‌లు, రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



కంకర తేలిన రోడ్డు

ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రేడియల్ రోడ్డు పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పనుల పూర్తి కోసం ఉద్యమిస్తాం



పాలకులు రోడ్డును నిర్మిస్తున్నది ప్రజల కోసమా? లేక రియల్ వ్యాపారస్తుల కోసమా అనేది ఆలోచించుకోవాలి. పేరు ప్రఖ్యాతులు ఉన్న వెంచర్లు ఉంటే ఆ మార్గంలో జనాలు తిరగపోయినా ఆగమేఘాల మీద రోడ్లను నిర్మిస్తారు. కానీ.. వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రోడ్లను మాత్రం పట్టించుకోరు. రేడియల్ రోడ్డు పనులను పూర్తి చేయాలనే డిమాండ్‌తో త్వరలో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

– ఈశ్వర్‌గారి రమణ, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఓఆర్‌ఆర్ 30ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు పనుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రేడియల్ రోడ్డు గుండా పలుచోట్ల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశాం. అదేవిధంగా మున్సిపాలిటీ కార్మికులతో రోడ్డును కూడా శుభ్రం చేయించాం. అధికారుల నుంచి తుది నివేదిక రాగానే రేడియల్ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

తాగునీటి ఇబ్బందులు ఉండొద్దు

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ప్రియాంకరెడ్డి




జహీరాబాద్: మాట్లాడుతున్న ఎంపీపీ ప్రియాంకరెడ్డి

జహీరాబాద్: ఎండాకాలం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ప్రియాంకరెడ్డి అన్నారు. మొగుడంపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మారుమూల తండాలు అధికంగా ఉన్నందునా తాగునీటి, విద్యుత్ సమస్యలు లేకుండా ఇప్పటి నుంచే కార్యచరణ చేపట్టాలని సూచించారు. జూన్ మాసం దగ్గరలో ఉన్నందునా వానాకాలంలో రైతులు పంటలు వేసుకునేందుకు వీలుగా అవసరమైన విత్తనాలు, ఎరువులు, పశువులకు వచ్చే రోగాలను నివారించేందుకు తగిన మేరకు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల ఎంపీటీసీలు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించగా త్వరలోనే పరిష్కరిస్తామని ఎంపీపీ, అధికారులు హామీనిచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ మహేష్, వైద్యాధికారి సీతారామరాజు, విద్యుత్ ఏఈ సతీష్, ఎంపీటీసీలు రాంచందర్, నిర్మలమ్మ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై నిలదీత


– సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం



కోహీర్: సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కోహీర్(జహీరాబాద్): కోహీర్ ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ మాధవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల్‌ఘాట్ ఎంటీటీసీ మల్లన్నపటేల్ మాట్లాడుతూ చాలాకాలంగా లో ఓల్టేజీ సమస్యతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల కొత్తూర్(కె), ఖానాపూర్ గ్రామాల్లో రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని వాపోయారు. సిద్దాపూర్ తండాలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఓల్టేజీ చాలడంలేదని మరో సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చాలని తండావాసులు చేస్తున్న విజ్ఞప్తులను పట్టించుకోవడంలేదని ఎంపీటీసీ షెట్టినాయక్ తెలిపారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా కొత్త జాబ్ కార్డుల తయారీలో జాప్యంతో కూలీలు నష్టపోతున్నారని ఎంపీటీసీ మల్లన్న పాటిల్ వాపోయారు. కొత్తూర్(కె), ఖానాపూర్ గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ భవనాలను వినియోగంలోకి తేవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసమ్మకు విజ్ఞప్తి చేశారు. సమావేశానికి పలువురు అధికారులు హాజరు కాకపోవడం పట్ల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాధవి మాట్లాడుతూ వచ్చే సమావేశం నాటికి సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్: ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకులనే ఎన్నుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో మున్సిపాల్టీ పరిధిలోని కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిపై తనకో విజన్ ఉందని, అందుకు గ్రౌండ్‌వర్క్ చేస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మర ప్రచారం

ఖేడ్ మండలంలోని పంచగామ, ర్యాకల్, పోతన్‌పల్లి, పలుగు తండాల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్‌షెట్కార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఖేడ్ మున్సిపాల్టీ పరిధిలోని పలు వార్డుల్లో మాజీ జెడ్పీటీసీ సంగీత షెట్కార్, కౌన్సిలర్లు లక్ష్మీబాయి, వివేకానంద్ పాల్గొన్నారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్ పిలుపునిచ్చారు. సురేష్ షెట్కార్‌కు మద్దతుగా యువజన కాంగ్రెస్ నాయకులు బోప్పన్‌పల్లి గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్‌శంకర్ పాటిల్ మాట్లాడుతూ ప్రజలు బీఆర్‌ఎస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు షకీల్, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, అమృత్, మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంగమేశ్వర్, సిద్దు పాటిల్, నరేష్‌కుమార్, రాఘవేందర్, యేసు రత్నం, ఫక్రుద్దీన్, రాంరెడ్డి, నర్సింహులు, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి

నారాయణఖేడ్: బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పాకాల శ్రీహరిరావు అన్నారు. ఖేడ్‌లో జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ నివాస గృహంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని కోరారు. టీపీసీసీ అధికార ప్రతినిధి పల్లె రాంచందర్ గౌడ్, రైతు రక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీశైలం యాదవ్, జిల్లా కోశాధికారి వెంకటేశం, రాష్ట్ర పచారకమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కౌన్సిలర్ వివేకానంద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాహెర్‌అలీ, వెంకాగౌడ్ పాల్గొన్నారు.

సొంతగూటికి బీఆర్‌ఎస్ నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని చీలపల్లి తండాకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శంకర్‌ఇటీవల బీజేపీలో చేరారు. తిరిగి శనివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

నియామకం

నారాయణఖేడ్: అంబేడ్కర్, పూలే సేవాసమితి ఖేడ్ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం సంఘ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రహీం, ప్రధాన కార్యదర్శి పండరిల సమక్షంలో సంఘం నాగల్‌గిద్ద మండలశాఖ అధ్యక్షులుగా గణేష్, ప్రధాన కార్యదర్శిగా శివానంద్‌ను నియమిస్తూ సంఘ జిల్లా శాఖ అధ్యక్షులు బైండ్ల కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్ నేతల ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని సోలక్‌పల్లి, రాళ్లకత్వ గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ యువజన నాయకులు ప్రవీన్‌రెడ్డి, ఇమ్రాన్‌ల ఆధ్వర్యంలో నీలం మధుకు మద్దతుగా ప్రచారాన్ని చేపట్టారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

నారాయణఖేడ్: గ్రామీణ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యవిధాన పరిషత్తు ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్‌ఎస్) సంగారెడ్డి సూచించారు. నాగల్‌గిద్ద మండలంలోని కరస్‌గుత్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట సూపరింటెండెంట్ అనురాధ, డాక్టర్ స్వప్న, ఫార్మసీ గిరి, సూపర్‌వైజర్ గురుస్వామి ఉన్నారు.

పాస్టర్ల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: చర్చి పాస్టర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి చర్చి పాస్టర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో సొంత నిధులతో 20కి పైగా చర్చిలు నిర్మించడంతో పాటు క్రైస్తవుల కోసం ఐదెకరాల స్థలాన్ని శ్మశాన వాటికకు కేటాయించినట్లు గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

పటాన్‌చెరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వేదిరి టౌన్‌షిప్, హెచ్‌ఎంటీ కాలనీ, పీజేఆర్ ఎన్‌క్లేవ్, సాయిఅంబిక కాలనీ, శ్రీవాణినగర్, జన్మభూమి ఫేజ్ 2 తదితర కాలనీలలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పర్యటించి ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని రూ.9వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఆరు గ్యారెంటీల హామీల అమలుపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కళాశాల యజమాన్యం

ఆటాపాట ఈదుర్స్

అలరించిన వశిష్ట డిగ్రీ కళాశాల విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో శనివారం సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీవీ కళాకారులు గడ్డం నవీన్, పంచ్ ప్రసాద్, వినోదిని కుమారి హాజరై ఆటా పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సినిమా పాటలకు డ్యాన్స్‌లు చేసి ఉర్రూతలూగించారు. అనంతరం డిగ్రీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దారెడ్డి, డైరెక్టర్లు శీలా రమేష్, అమర్‌నాథ్, సంజీవ్‌రావు, శంకర్‌రావు, విశ్వనాథ్, మారుతిరావు, అధ్యాపకులు శశికాంత్, కృష్ణ, శ్రీను, సంగన్న, పండరి, భార్గవి, శిల్ప, సంగీత, శ్రావ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల రైతు సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో తిరిగి మరో 50మంది బీఆర్‌ఎస్‌కు చెందిన యువకులు, కార్యకర్తలతో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి నీలం మధు ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి మోహన్‌రెడ్డితో సమావేశమయ్యారు.

కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని కంబాలపల్లి మాజీ సర్పంచ్ రాములుతో పాటు పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, వెంకటాపూర్ గ్రామానికి చెందిన మాజీ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దుర్గంబోయిన పెద్ద పోచన్న, సీనియర్ నాయకులు ఖాజా కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి సమక్షంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని గొడిగార్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్, నాగిరెడ్డి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సీడీసీ మాజీ డైరెక్టర్

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన మాజీ సీడీసీ మాజీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ ఉద్యమ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

మునిపల్లి(అందోల్): ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని బుదేరా ఎస్ఐ సురేష్ అన్నారు. మండల పరిధిలోని బుదేరా, కంకోల్ శివారు 65వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మట్లాడుతూ ఎవరైనా నగదు తీసుకెళ్లాలంటే తగిన రశీదులు, ఆధారాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. లేనిపక్షంలో నగదు సీజ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం



బ్యాతోల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీతరెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ, కార్పొరేటర్లు సింధురెడ్డి, పుష్ప, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితారెడ్డి ఆధ్వర్యంలో ఆయా కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధిని చూసి వెంకట్రామిరెడ్డికి ఓటు వేయాలని కోరారు. మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు అదర్శ్‌రెడ్డి, ఐలేష్, పరమేష్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

కంది(సంగారెడ్డి): బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరిరెడ్డి, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బేగంపేట్, బ్యాతోల్, ఎర్దనూర్, ఏర్దనూర్ తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ నారాయణయాదవ్, జిల్లా నాయకులు ఖాజాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని11వ వార్డు బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి వాదోని చంద్రశేఖర్ అన్నారు. 11వ వార్డులో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మక్బూల్, ప్రభు, సత్తన్న, మురళి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని లక్ష్మీపతిగూడెం గ్రామంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. తాము చేపడుతున్న ప్రచారానికి అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.